క్లుప్తంగా

పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి



నిజాంపేట(మెదక్): ఎమ్మెల్సీ అంజిరెడ్డికి వినతి పత్రం అందిస్తున్న చల్మెడ బీజేపీ నాయకులు

నిజాంపేట(మెదక్): మండలంలోని చల్మెడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని బీజేపీ నాయకులు ఆయన స్వగృహంలో ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. శుక్రవారం కరీంనగర్ మెదక్ ఆదిలాబాద్ నిజామాబాద్ బీజేపీ ఎమ్మెల్సీగా చిన్నమైల్ అంజిరెడ్డి గెలిచిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చల్మెడలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రహరీ, మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు శివకృష్ణ, మండల శక్తి కేంద్రం ఇన్‌చార్జి శ్రీకాంత్, బూత్ అధ్యక్షుడు మధు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో శుక్రవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పెద్దమ్మతల్లి కల్యాణోత్సవంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేశంగౌడ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి, దుబ్బాక కో కన్వీనర్ గోవింద్, గణేశ్, పట్టణాధ్యక్షుడు చంద్రశేఖర్, లింగారెడ్డి, నర్సింహులు, లక్ష్మణ్, గురుపాథం, సందీప్, నితిన్ పాల్గొన్నారు.

అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అందుబాటులో ఉండి సమస్యలు లేకుండా చూడాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన అయిన లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టేలా చూడాలన్నారు. విడతల వారిగా డబ్బులు వస్తాయని, గ్రామాల్లో వననర్సరీల్లో మొక్కల పెంచాలన్నారు. నర్సరీలలో మొక్కలకు ఎండ తగలకుండా షెడ్‌నెట్‌తో నీడ ఏర్పాటు చేయాలని చెప్పారు. నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎంపీఓ కలీముల్ల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాల పరిశీలన



రామాయంపేట(మెదక్): మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సజీలుద్దీన్

రామాయంపేట(మెదక్): మండలంలోని ప్రగతి ధర్మారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఎంపీడీవో సజీలుద్దీన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనాన్ని, బియ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం వండి పెట్టాలని ఆయన సూచించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



శిబిరానికి వచ్చిన రోగులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేట ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సికింద్రాబాదు వాసన్ కంటి వైద్య సిబ్బంది పంచాయతీ కార్యాలయం వద్ద వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరం ఉన్న వారికి కంటి అద్దాలు, మందులు అందజేశారు. మరికొందరికీ ఆపరేషన్ అవసరం ఉన్నందున వారికి ఉచితంగా చేయించామని శిబిరం కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ తెలిపారు.

మహిళా సాధికారతే లక్ష్యం



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళలను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ హుస్సేన్

మెదక్‌జోన్: మహిళా సాధికారత దిశగా ఇంకా ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ మాట్లాడారు. కార్యక్రమంలో ఐక్యూఏసి కోఆర్డినేటర్ డా. తిరుమల్ రెడ్డి, మహిళా సాధికారత విభాగం కోఆర్డినేటర్ సుధారాణి, సఖి సెంటర్ లీగల్ సెల్ కన్వీనర్ శ్రీలత, సభ్యులు హరిత, అరుంధతి, నిదర్శిని, దీప్తి సంధ్యశ్రీ, నాగరాణి, హబీబున్నీసా, కళాశాల నాన్-టీచింగ్ మహిళా సిబ్బంది, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని మహిళా ఉపాధ్యాయ ఉద్యోగులను వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరంజ్యోతి శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ నీరజ, ఉపాధ్యాయులు రాధ, రమ, సరస్వతి, శ్రీవాణి, రేఖ, ఉమా, ఐకేపీ ఎపీఎం లక్ష్మీనర్సమ్మ, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): బాలికల ప్రాథమిక పాఠశాలలో మహిళా ఉద్యోగులను తహసీల్దార్ గ్రేస్‌బాయి సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశం, హెచ్‌ఎం చంద్రప్రకాష్, ఉపాధ్యాయులు శ్రీవాణి, స్వప్నకుమారి, రామకృష్ణాగౌడ్ తదితరులున్నారు.



పెద్దశంకరంపేటలో..



చేగుంట(తూప్రాన్): మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న పరంజ్యోతి

కార్మికులకు కనీస వేతనం ఇవ్వండి

సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

మెదక్ కలెక్టరేట్: కార్మికుల కనీస వేతనం రూ.26వేలుగా ఎంప్లాయిమెంట్ డ్రాఫ్ట్ జీఓలను సవరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మల్లేశం మాట్లాడుతూ.. రాష్ట్రంలో 73వ షెడ్యూల్ ఎంప్లాయిమెంట్‌లో పనిచేస్తున్న కార్మికుల సంఖ్య సుమారు రూ.1.20 కోట్లు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం యాజమాన్యాలకు అనుకూలంగా కనీస వేతనాలు ఏకపక్షంగా విడుదల చేసిందని ఆరోపించారు. అభ్యంతరాలు ఇచ్చి కూడా సంవత్సరం గడిసినా.. జీఓలను సవరించడం లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, కోశాధికారి నర్సమ్మ, నాయకులు సంతోష్, నాగేందర్‌రెడ్డి, అనిల్, అజయ్, సత్యం పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

కార్మికుల వేతనాలు చెల్లించండి

కౌడిపల్లి(నర్సాపూర్): ఎనిమిది నెలలుగా వేతనాలు రావడంలేదని త్వరగా చెల్లించాలని కోరుతూ ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కలీముల్లకు మండల పంచాయతీ కార్మికులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్మికులు రమేశ్, శ్రవన్, పద్మ, లక్ష్మి, నర్సింలు, లింగం, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



కౌడిపల్లిలో ఎంపీడీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్మికులు

మనోహరాబాద్(తూప్రాన్): నెలలు గడుస్తున్న తమకు వేతనాలు చెల్లించడం లేదని మండల పంచాయతీ కార్మికులు, సిబ్బంది శుక్రవారం మండల పరిషత్ వద్ద నిరసన చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో కార్మికులతో కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ కార్మికుల అధ్యక్షుడు శ్రీకాంత్, ఉపాధ్యక్షులు స్వామి, వీరేష్, పుష్ప, ఇందిరా, బాలమణి, అంజయ్య, అర్జున్, రాములు, పలు గ్రామాల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



మనోహరాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

శివంపేట(నర్సాపూర్): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు మల్టీపర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని గ్రామ పంచాయతీ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు ధర్నా చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ప్రతీనెల వేతనాలు చెల్లించాలన్నారు. ఎస్టీవోలతో నిలిచిపోయిన బకాయి వేతనాలు విడుదల చేయాలని, పంచాయతీల బ్యాంక్ ఖాతాపై ఫ్రీజింగ్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. వేసవి నేపథ్యంలో కార్మికుల భద్రత దృష్టిలో ఉంచుకొని ఒకపూట పని కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు స్వామి, వసంత, బాలకృష్ణ, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



శివంపేటలో వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

లోక్ అదాలత్ కేసుల పరిష్కారం

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కేసులకు శుక్రవారం అల్లాదుర్గం జూనియర్ సివిల్ కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 9 కేసులు రాజీ పడటంతో పరిష్కరించినట్లు ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి చెప్పారు. మండలంలో 9 కేసుల్లో ఇరువర్గాల వారు రాజీ పడటంతో అల్లాదుర్గం జూనియర్ సివిల్, ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి సాయి ప్రభాకర్ అక్కడికక్కడే పరిష్కరించినట్లు చెప్పారు. 44 డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో ఒక్కొక్కరికీ రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

తూప్రాన్: మండలంలోని ఘనపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆర్డీఓ జయచంద్రారెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. శ్రద్ధగా చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులను వివిధ పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేతనాల కోసం పంచాయతీ కార్మికుల భిక్షాటన



మాసాయిపేట గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

వెల్దుర్తి(తూప్రాన్): పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలంటూ మాసాయిపేట గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని గ్రామంలోని పలు దుకాణాలు, నివాస గృహాల్లో భిక్షాటన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నా, నెలనెలా సక్రమంగా వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నా.. తమపై నిర్లక్ష్యవైఖరి అవలంభించడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి.. పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు నెలనెలా వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

జీవితంలో కష్టపడితే భవిష్యత్

నర్సాపూర్: జీవితంలోని మొదటి ఐదేళ్లు కష్టపడి పనిచేస్తేనే భవిష్యత్ విజయవంతంగా ఉంటుందని బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీకి చెందిన సీఎస్ఈ హెచ్ఓడీ మధుబాబు చెప్పారు. డాక్టర్ రెడ్డీస్ లాబరేటరీస్ సెల్ఫ్ మేనేజ్‌మెంట్ ట్రైనీస్ 36వ బ్యాచ్ సభ్యులకు శుక్రవారం కాలేజీలో వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడి పనిచేసే వారికి భవిష్యత్ అంతా బాగుంటుందన్నారు. కెమికల్ ఇంజనీరింగు హెచ్ఓడీ భానురాధిక మాట్లాడుతూ.. విద్యార్థులు మనస్సును, భావోద్వేగాలను నియంత్రించుకుంటే జీవితంలో విజయాలకు దోహదపడుతుందని హితవు పలికారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, ఇతర హెచ్ఓడీలు విష్ణు, డాక్టర్ రెడ్డీస్ లాబరేటరీస్ కంపెనీ సైట్ హెడ్ హిమాంషు, ఇతర ప్రతినిధులు సతీష్‌కుమార్, నీలిమా కులకర్ణి, మోహన్‌రావు, షాలిని మన్‌హాస, అచ్చుతరామరాజు తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న కాలేజీ, కంపెనీ ప్రతినిధులు

పోషకాహారం లేక కోళ్లు మృత్యువాత

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గూడూర్‌లోని పౌల్ట్రీ ఫామ్‌లో కోళ్లకు పోషకాహారం అందక మృత్యువాత పడ్డాయని పశు వైద్యాధికారి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం కోళ్ల మృతిచెందిన ఫామ్‌ని సందర్శించి వివరాలు సేకరించారు. ప్రీమియం కంపెనీకి సంబంధించి గూడూర్ ఫామ్స్ కోళ్లను పెంచుతున్నట్లు ఈ మధ్యకాలంలో కోళ్ల మృత్యువాత పడుతున్నాయి. దీంతో నాలుగు రోజుల నుంచి వాటికి దాన, నీరు ఇవ్వకపోవడంతో పోషకాహార లోపంతో ఇమ్యూనిటీ దగ్గి చనిపోయినట్లు చెప్పారు. వాటికి బర్డ్‌ఫ్లూ గాని ఇతర రోగాలు గాని సోకలేదన్నారు. నిర్వాహకులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

కోళ్ల ఫారం పరిశీలన


చిన్నశంకరంపేట(మెదక్): బర్డ్‌ఫ్లూ భయంతో చికెన్ తినేవారి సంఖ్య తగ్గడంతో కొన్ని రోజుల వరకు కోళ్లఫారం యజమానులు కోడిపిల్లలను (చిక్స్) దించుకోవద్దని వెటర్నరీ డాక్టర్ గీతా మాలిక సూచించారు. శుక్రవారం మండలంలోని సంగాయిపల్లి గ్రామ శివారులోని కోళ్లఫారంలోని కోళ్లను పరిశీలించారు. కోళ్ల ఆరోగ్యంగానే ఉన్నాయని, చికెన్ కొనుగోలుదారులు ఎలాంటి ఆందోళన చెందొద్దన్నారు. వేసవితో కొంత వరకు కోళ్ల సహజంగానే సమస్యను ఎదుర్కొంటాయని, ఇప్పటి పరిస్థితిలో కొంత వరకు ప్రజల్లో భయం కూడా ఉందన్నారు. ఇలాంటి సమయంలో కోళ్లఫారంలో కొన్ని రోజుల వరకు నూతన కోళ్లను దింపుకోకుండా జాగ్రత్త పడాలన్నారు.



సంగాయిపల్లిలో కోళ్లఫారంలోని కోళ్లను పరిశీలిస్తున్న వెటర్నరీ డాక్టర్ గీతామాలిక

దుర్వాసనతో పాఠశాల బోరుబావి నీరు

చేగుంట(తూప్రాన్): మండలంలోని చిన్నశివునూర్ పాఠశాల బోరుబావి నీరు దుర్వాసన వస్తుందని గ్రామస్తులు హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో బోరుబావి నీరు దుర్వాసన వస్తుందని విద్యార్థులు తల్లిదండ్రులతో తెలియజేయడంతో శుక్రవారం పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఎంఈఓ నీరజ పాఠశాలకు చేరుకొని విచారణ చేపట్టగా.. వారం రోజులుగా దుర్వాసన వస్తున్న నీటితోనే విద్యార్థులకు భోజనం వండుతున్నారని, అవే నీటిని విద్యార్థులకు అందిస్తున్నాడని హెచ్‌ఎం ప్రభాకర్‌పై గ్రామస్తులు ఆరోపించారు.



చిన్నశివునూర్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ నీరజ

ఉత్తమ విద్యావేత్త అవార్డు అందజేత



ప్రిన్సిపాల్ సంధ్యారాణిని అభినందిస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాస్ చౌదరి

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని సిద్ధార్థ్ మోడల్ హైస్కూల్ ప్రిన్సిపాల్ సంధ్యారాణికి ఉత్తమ విద్యావేత్త అవార్డు వచ్చినట్లు విద్యాసంస్థల కరస్పాండెంట్ శ్రీనివాస్ చౌదరి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో ఆమెను సన్మానించారు ఈ కార్యక్రమంలో వివిధ బ్రాంచీల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి

మండల ప్రత్యేక అధికారి నీలిమ

వెల్దుర్తి(తూప్రాన్): వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసించే విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారిణి, డీటీడీఓ నీలిమ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం వెల్దుర్తిలోని కేజీబీవీ, బాలుర సంక్షేమ వసతి గృహాలను తహసీల్దార్ కృష్ణతో కలిసి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని తరగతి గదులు, కిచెన్ రూం, స్టోర్ రూమ్, మరుగుదొడ్లు, వాటర్‌ట్యాంక్, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార మెనూను పరిశీలించి నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్ఓ ఫాతిమాను ఆదేశించారు. అనంతరం మండల ప్రత్యేక అధికారి నీలిమ మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాలతో వసతిగృహాలను తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించామన్నారు. ఆయా వసతిగృహాల్లో నెలకొన్న సిబ్బంది కొరత విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. హాస్టల్ వార్డెన్‌లు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. తనిఖీలో ఎంపీడీఓ ఉమాదేవి, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి బలరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకాలున్న భోజనాన్ని పెట్టాలని జిల్లా పౌర సరఫరాల అధికారి, మండల ప్రత్యేకాధికారి సురేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఎంపీడీఓ ఆనంద్‌తో కలిసి మండల పరిధిలోని చిట్కుల్ శివారులోని కేజీబీవీ ఆవరణ, కూరగాయాలు స్టోర్, వంటగది, విద్యార్థులకు సరఫరా అయ్యే రేషన్, విద్యార్థులకు వడ్డించే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టోర్ రూంలో కూరగాయాలను తట్టు సంచులు వేయడం సరైంది కాదని, తద్వారా కూరగాయాలపై దోమలు చేరుతాయన్నారు. త్వరగా పాడైపోయే కూరగాయాలను ముందుగానే వండుకోవాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదన్నారు. విద్యార్థులకు పరిశుభ్ర వాతావరణంలో వండిన, నాణ్యమైన భోజనాన్ని అందజేయాలన్నారు. కేజీబీవీ ప్రత్యేకాధికారి అంజలి కేజీబీవీలో ఉన్న పలు సమస్యల గురించి వివరించగా, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్యామ్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, కేజీబీవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులకు ప్రతీరోజు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కలీముల్ల అన్నారు. శుక్రవారం మండలంలోని కొట్టాల, లింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎంపీడీఓ, కంచన్‌పల్లిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఎంపీఓ మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీరోజు మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



వెల్దుర్తి(తూప్రాన్): కేజీబీవీలో వంటశాల నాణ్యతపై ఆరా తీస్తున్న అధికారులు



కౌడిపల్లి(నర్సాపూర్): కంచన్‌పల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న ఎంపీఓ

సంక్షిప్త వార్తలు

◆ **పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం**

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సంగాయిపేటలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. సమీపంలోని మంజీరా నది నుంచి జలాలను తీసుకొచ్చారు. అమ్మవారి విగ్రహాన్ని మంగళ హారతులతో ఊరేగింపుగా తీసుకొచ్చి విగ్రహాన్ని జలాధివాసం చేశారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవచనం, ప్రత్యేక పూజలను నిర్వహించారు.

◆ **పిల్లర్‌ను ఢీకొన్న టిప్పర్ : క్లీనర్ మృతి**

హవేళిఘణాపూర్(మెదక్): ప్రమాదవశాత్తు టిప్పర్ పిల్లర్‌ను ఢీకొట్టడంతో వాహన క్లీనర్ మృతి చెందగా డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన మండల కేంద్రమైన హవేళిఘణాపూర్‌లో చోటు చేసుకుంది. గురువారం అర్ధరాత్రి మెదక్ పట్టణానికి చెందిన టిప్పర్‌ను బ్యాతోల్ రోడ్డు వైపు నుంచి వస్తుండగా డ్రైవర్ నవీన్ అజాగ్రత్తగా నడపడంతో వైకుంఠదామం పిల్లర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నవీన్ బయటపడగా, క్లీనర్ సోహెల్(21) మృతి చెందాడు. ఘటనపై ఫిర్యాదు రాలేదని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

◆ **రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి**

నర్సాపూర్ రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన నర్సాపూర్ – వెల్దుర్తి రహదారిలోని నారాయణపూర్ గంగారం తండా వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై లింగం కథనం మేరకు.. తండాకు చెందిన జర్పుల రావుజా (55) పొలానికి నీరు పెట్టి ఇంటికొస్తుండగా రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి, కుటుంబ సభ్యులతో కలిసి నర్సాపూర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కుటుంబీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

◆ **డంప్‌యార్డు ఎత్తి వేయాలి**

నర్సాపూర్: డంప్‌యార్డు ఎత్తి వేసే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని జేఏసీ నాయకులు ప్రకటించారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల్ల మండలం ప్యారానగర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న డంప్‌యార్డును ఎత్తి వేయాలని నర్సాపూర్‌లో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారం నాటికి 19వ రోజుకు చేరాయి. జేఏసీ నాయకులు రాజేందర్, రాజుయాదవ్, సురేశ్, నర్సింగ్‌రావు, ఆనంద్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ.. డంప్‌యార్డును ఎత్తి వేసే వరకు తమ ఉద్యమం కొనసాగిస్తామని చెప్పారు. దీక్షలో జేఏసీ నాయకులు సుబ్రమణ్యం, నారాయణరెడ్డి, శంకర్, సంతోష్, నర్సింలు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి**

చిన్నశంకరంపేట(మెదక్): ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకొని ప్రభుత్వం నుంచి అమోదం పొందిన ప్లాట్స్ యజమానులు ఈ నెల 31 వరకు రెగ్యూలరైజేషన్ ఫీజును చెల్లించాలని గ్రామ పంచాయతీ ఈఓ ప్రదీప్ కోరారు. రెగ్యూలరైజేషన్ ఫీజు చెల్లించిన వారికి మొత్తంలో 25 శాతం తగ్గింపు వర్తిస్తుందన్నారు. ఫీజు చెల్లించిన తర్వాత ప్లాట్స్‌ను పరిశీలించి రెగ్యూలరైజ్ చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

◆ **234 మంది గైర్హాజరు**

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. శుక్రవారం మూడోరోజు ఇంటర్మీడియెట్ ఫస్ట్ ఇయర్ ఇంగ్లీష్ పరీక్ష నిర్వహించగా.. 234 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్ పరీక్షల నోడల్ అధికారి మాధవి తెలిపారు. మొత్తం 6,516 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 6,282 మంది హాజరు కాగా 234 మంది విద్యార్థులు వివిధ కారణాలతో పరీక్షకు హాజరు కాలేదని పేర్కొన్నారు.